ప్రత్యేకావసరాల పిల్లలకు ఆసరా

• మానసికోల్లాసంతో పాటు సహిత విద్య
• భవిత కేంద్రంతో దివ్యాంగుల్లో వెలుగులు



పిల్లలకు సహిత విద్య బోధన

నెల్లూరు రూరల్: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రం ఆసరాగా నిలుస్తోంది. బుద్ధిమాంద్యం, ఇతర అవయవ లోపాలు కలిగిన పిల్లలకు మనోధైర్యాన్నిస్తూ వారిలో పురోగతికి దోహదపడుతోంది. ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలు గతంలో ఇళ్లకే పరిమితమయ్యేవారు. వీరిని తల్లిదండ్రులు ఎంతో శ్రద్ధగా చూసుకోవాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే కార్యకలాపాలను భవిత కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నారు. నగరంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులైన పిల్లలకు ఆటపాటలతో పాటు మనోవికాసానికి తగిన విధంగా బాటలేస్తున్నారు. దీంతో గతంలో వ్యక్తిగత పనులు సైతం చేసుకోలేని పిల్లలు ప్రస్తుతం తమ అవసరాలను తామే చేసుకునే స్థితికి వస్తున్నారు.

సేవలిలా..

• భవిత కేంద్రంలో 21 రకాల బుద్ధి మాంద్యం కలిగిన దివ్యాంగుల పిల్లలను పాఠశాలల తరహాలోనే ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 3.40 వరకు సంరక్షిస్తారు. సహిత విద్యను అందిస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్రశిక్ష పథకం ద్వారా భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు మానసికోల్లాసానికి ఆటపాటలతో ఉత్తేజపరుస్తున్నారు. నెల్లూరు అర్బన్, రూరల్ పరిధిలో వివిధ లోపాలు కలిగిన పిల్లలు ఈ కేంద్రంలో ఉన్నారు.

• కేంద్రంలో ప్రతి సోమవారం ఫిజియోథెరపీని నిర్వహిస్తున్నారు. కేంద్రంలో పిల్లలకు సోమవారం నుంచి శుక్రవారం వరకు సేవలందిస్తున్నారు. పిల్లల్లో అంగవైకల్యాన్ని తగ్గించేందుకు యోగాను సైతం చేస్తుంటారు.

• గృహ సందర్శనను శనివారం చేపట్టి అక్కడ పిల్లల తల్లిదండ్రులతో రిసోర్స్ ఉపాధ్యాయులు సమావేశమవుతారు. సహిత విద్య రిసోర్స్ ఉపాధ్యాయులు ఇద్దరు, పిల్లల సంరక్షణకు ఒక వలంటీర్, ఒక ఫిజియోథెరపిస్ట్ విధులు నిర్వర్తిస్తున్నారు.

• ఈ కేంద్రంలోని సహిత విద్య పిల్లల పేర్లను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేస్తారు. తరగతుల ప్రమోషన్ కూడా ఉంటుంది. ఈ కేంద్రాల్లో గతంలో సహిత విద్య పొందిన పలువురు పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పిల్లలు ఏళ్ల తరబడి ఈ కేంద్రాలకు వస్తూ బుద్ధి మాంద్యం నుంచి బయటపడుతున్నారు.

దివ్యాంగులకు పరికరాల అందజేత

వినికిడి, ఇతర శరీర అవయవ లోపాలు కలిగిన పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా వివిధ రకాల పరికరాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. వీల్‌చైర్, సీపీ చైర్, ట్రై సైకిల్, హియరింగ్ మెషీన్లు, తదితర పరికరాలను అందజేస్తున్నారు. గతేడాది 35 మంది పిల్లలకు 46 పరికరాలను అందజేశారు.



• ఈ చిత్రంలోని మహిళ పేరు శ్రావణి. కపాడిపాళెంలో నివాసం ఉంటున్న ఈమె కుమార్తె రిషితకు పదేళ్లు. బుద్ధి మాంద్యం కలిగిన రిషితకు రెండేళ్ల క్రితం గుండె ఆపరేషన్ చేశారు. భవిత కేంద్రానికి ఏడాదిన్నరగా వస్తోంది. స్పీచ్ థెరపీని కేంద్రంలో ఇస్తుండటంతో పాప పరిస్థితి ఎంతో బాగుందని తల్లి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



• ఈ ఫొటోలోని మహిళ పేరు అబీదా. టెక్కేమిట్టలో నివాసం ఉంటున్న ఈమెకు 18 ఏళ్ల కుమారుడున్నారు. బుద్ధి మాంద్యంతో పాటు శారీరక ఎదుగుదలల్లేదు. బాబును ఈ కేంద్రంలో ఎనిమిదేళ్ల క్రితం చేర్పించారు. శారీరకంగా ఎదుగుదల రాకపోయినా, బుద్ధిమాంద్యం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. తన పనులు తాను చేసుకునే స్థాయికి వచ్చారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మెరుగ్గా ఉన్నాడని తల్లి చెప్పారు.



• ఈ చిత్రంలోని మహిళ పేరు మేరీ. నక్కలోళ్ల సెంటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఈమెకు 8, 9 ఏళ్ల వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరికీ బుద్ధి మాంద్యం ఉంది. వ్యక్తిగత పనులను గతంలో చేసుకునే వారు కాదు. ఏడాది క్రితం భవిత కేంద్రంలో చేరారు. ప్రస్తుతం వీరి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని తల్లి చెప్పారు.



భవిత కేంద్ర భవనం

మరో భవిత కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదనలు

నగరంలో మరో భవిత కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరికరాలను ఉచితంగా అందించడంతో పిల్లల్లో పురోగతి కనిపిస్తోంది.

\- తిరుపాల్, ఎంఈఓ

మొలకపోలేరమ్మ జాతర ప్రారంభం



ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన మొలకపోలేరమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా తొలిరోజు కలశ స్థాపన చేశారు. రెండో రోజైన సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు మంగళవారం పొంగళ్లు, అమ్మవారికి పూర్ణాహుతి, దర్శనం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీరాంజనేయస్వామికి విశేషాలంకారం



ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరాంజనేయస్వామికి వివిధ పుష్పాలు, పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమా హనుమంతరావు, సోమా శ్రీనివాసరావు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

క్లుప్తంగా

గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడి విహారం

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామచంద్రుడిని గరుడ వాహనంపై విశేష పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయకర్తలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కనకదుర్గాదేవికి పొంగళ్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో శ్రీకనకదుర్గాదేవి ఆలయం 16వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పెన్నానది జలాలతో అభిషేకం, దేవతామూర్తుల గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో మేళతాళాలు, బాణసంచా మోతలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లల ప్రతిభకు పెద్దల ప్రోత్సాహం అవసరం

చేజర్ల (సోమశిల): తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతో పాటు వారు దేనిపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారో ప్రోత్సహిస్తే తమ సృజనాత్మకతను పెంపొందించుకుంటారని ఆమనిచిరువెళ్ల సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జి మాల్యాద్రి అన్నారు. ఆదివారం అనంతసాగరం గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు రాకెట్, నక్షత్రం, జాతీయ జెండా, బర్త్‌డే గ్రీటింగ్స్ తదితర పేపర్ క్రాఫ్టలతో అలరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని నందవరం మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే జూన్ నెల 7వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్ పద్ధతిలో కూడా అప్లికేషన్ రుసుం చెల్లించిన వారికి ఒక జనరల్ నంబరు కేటాయిస్తామన్నారు. ఆ నంబరు ఆధారంగా ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ తరగతులకు చెందిన వారు రూ.200, ఎస్సీ, ఎస్టీ తరగతులకు చెందిన రూ.150 చొప్పున ప్రవేశ దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. మెరిట్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశాలు నిర్ణయిస్తారన్నారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లేదా మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. నెల్లూరులోని వేదాయపాళెం ప్రాంతానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ మోటార్ సైకిల్‌పై కసుమూరు దర్గాకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్లే క్రమంలో కసుమూరు మలుపురోడ్డు వద్ద అడ్డు వచ్చిన ఆటోను తప్పించబోయి మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో కిందపడిపోయి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన విరామ బైబిల్ శిక్షణ తరగతులు



కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం దండిగుంటలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో జరుగుతున్న విరామ బైబిల్ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బైబిల్‌పై చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవ ఇమ్మానుయేలు, సండే స్కూల్ టీచర్లు వనజాక్షి, సుప్రజ, సంఘ పెద్దలు కాగొల్లు మస్తానయ్య, విక్రమ్‌తేజ, పవన్, వినయ్ తెలుగు బాప్టిస్టు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఈ - కేవైసీకి ఫేస్ ఐడెంటిఫికేషన్

కొడవలూరు: పీఎం కిసాన్ ఈ కేవైసీకి వేలిముద్రలు పడని రైతుల సౌకర్యార్థం ఫోన్‌లో ఫేస్ ఐడెంటిఫికేషన్ సదుపాయం కల్పించారని ఏఓ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలి ముద్రలు పడని రైతులు ఆర్బీకేలలో సంప్రదించి ముఖచిత్రం ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

సాయికృష్ణకు అవార్డు ప్రదానం

నెల్లూరు(దర్గామిట్ట): డిప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణకు కార్టూనిస్ట్ అవార్డు లభించింది. ప్రముఖ కార్టూనిస్ట్ తలశెట్టి రామారావు జయంతిని పురస్కరించుకొని హాస్యానందం మాసపత్రిక ఎడిటర్ రాము, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి ఆధ్వర్యంలో కార్టూనిస్ట్ పోటీలను నిర్వహిస్తున్నారు. 2023కు గానూ నిర్వహించిన పోటీల్లో ఇందుకూరుపేటకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. నెల్లూరుకు చెందిన కార్టూనిస్ట్ రామ్‌శేషుకు విశిష్ట బహుమతి లభించింది.



యోగాపై అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): శాస్త్రీయ యోగా శిక్షణ తరగతులపై అవగాహన సదస్సును బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు.

యోగా శిక్షకులు చలపతి, మల్లికార్జునరావు, యోగా మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్‌రెడ్డి, రవీంద్ర, పద్మావతి, నజీర్‌బాషా, శ్రీరాములు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీకి నివాళులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నేతలు ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పార్టీ నేత రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నేతలు రమణయ్యగౌడ్, బలరామయ్య, రామారావు, సాయిరామ్, గోపాల్, శేషగిరిరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

• ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, శేషారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, ఫయాజ్, రాజేష్ రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐవీ బాధితులకు అండగా నిలవాలి





నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీ రోగులకు అండగా ఉంటూ వారిపై ప్రేమను పంచాలని ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం తెలుపుతూ క్యాండిల్ ర్యాలీని ప్రభుత్వ బీఈడీ కళాశాల నుంచి వైద్య శాఖ కార్యాలయం వరకు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ రహిత జిల్లాగా నెల్లూరును మార్చాలని కోరారు. డాక్టర్ పవిత్ర, ఎన్నెన్పీ పాజిటివ్ పీపుల్ అధ్యక్షురాలు ధనూర్జ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కొమ్మలపూడి జట్టు

మనుబోలు: పిడూరులో జరుగుతున్న ఆర్టీఆర్, ఆడిపూడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కొమ్మలపూడికి చెందిన హనుమాన్ క్రికెట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పిడూరు మెయిన్ టీం 10 ఓవర్లలో 36 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం హనుమాన్ క్రికెట్ క్లబ్ జట్టు కేవలం 4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు షీల్డుతో పాటు రూ.15 వేల నగదు బహుమతి అందజేశారు. రన్నర్ జట్టుకు షీల్డుతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. టోర్నమెంట్ స్పాన్సర్ ఆడిపూడి రవితేజరెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, పవన్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఆర్గనైజర్లు వినయ్, శ్రీహరి, వెంకట్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న కొమ్మలపూడి జట్టు

వ్యవసాయ విభాగ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక



ఆత్మకూరురూరల్: రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, పశుసంవర్ధక సహాయకుల ఆత్మకూరు డివిజన్ స్థాయి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బ్రహ్మేంద్ర మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన హక్కుల కోసం తన అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏఎస్‌పేటకు చెందిన శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సాయిమహేష్, కోశాధికారి నాగేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా షేక్ యస్థానీ, పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ హసన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

కావలి: వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం బస్టాండ్ ఆవరణలో వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లను ఆవిష్కరించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు సిబ్బంది, ప్రయాణికులు దూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో మంచినీళ్లు వెంట తీసుకెళ్లాలని, పలుచటి, వదులు దుస్తులు ధరించాలన్నారు. కావలి రెడ్‌క్రాస్ కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు వంటి సహజ పానియాలను తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, రెడ్‌క్రాస్ సభ్యులు ఏజే మల్లేశ్వరరావు, కార్మిక నాయకులు జి విజయ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతపై వేసవి శిక్షణ

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రత్యేకించి సృజనాత్మకత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం పలు పాఠశాలల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు వెలిశెట్టి నారాయణరావు ద్వారా సృజనాత్మకత అంశాలు, ఊహాశక్తితో పాటు జ్ఞాపకశక్తి పెరిగే అంశాలపై శిక్షణ ఇప్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, తదితర అంశాలను ప్రాక్టికల్‌గా చేయించారు. కొన్ని పజిల్ పుస్తకాలను వారికి ఇచ్చి వారి విజ్ఞానాన్ని ప్రశ్నల ద్వారా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ ఎ వెంకటేశ్వర్లు, లైబ్రరీ అసిస్టెంట్ ఎల్.తనూజ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు డిమాండ్



నెల్లూరు(బారకాసు): తాటి ముంజలు వేసవి సీజన్లో మాత్రమే దొరికే పల్లెటూరి మధురాలు. తాటి చెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి తాజాగా అప్పటికప్పుడు కాయలు కొట్టి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. ఈ సీజన్లో తాటి ముంజలకు మంచి డిమాండ్ ఉంటుంది. గతంలో చాలా తక్కువ ధరకు లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలాల గట్లపై వరుసగా తాటి చెట్లు కనిపించేవి. ఇప్పుడు ఎక్కడో కొన్ని ప్రాంతాల్లోనే దర్శనమిస్తున్నాయి. నాలుగు తాటి కాయల నుంచి తీసిన ముంజలను రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తింటున్నారు.



ఆర్‌బీకేల్లో సమృద్ధిగా ఎరువులు

కొడవలూరు: మండలంలోని ఆర్‌బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ సీహెచ్ ఎస్ లక్ష్మి తెలిపారు. ఆలూరుపాడు ఆర్‌బీకేకు వచ్చిన ఎరువుల నిల్వలను ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడగారు సాగుకు అవసరమైన మేరకు డీఏపీ, యూరియాను ఇప్పటికే ఆర్‌బీకేలకు చేర్చినట్లు చెప్పారు. ఆర్‌బీకేలో ఇండింట్ పెట్టిన మరుసటి రోజే ఎరువులను పొందవచ్చని తెలిపారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలను యాభై శాతం రాయితీపై ఇస్తున్నామని తెలిపారు. ఎడగారు సాగు చేయని రైతులు వేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట వీఏఏ వెంకట పృథ్వీ ఉన్నారు.



లారీ నుంచి ఎరువుల లోడింగ్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ సంగమేశ్వరరావు

పొదలకూరు : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో లింగంపల్లి యూత్ ఆధ్వర్యంలో మూడు మండలాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడల్లో రాణించాలన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 21 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి రూ.10,016, రన్నర్ జట్టుకు బిట్-4 ఎంపీటీసీ జీ.శ్రీనివాసులు రూ.7,016 నగదు బహుమతులను అందజేయనున్నట్లు వివరించారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకట నగేష్‌నాయుడు

క్రికెట్ పోటీలు ప్రారంభం

కొడవలూరు: చంద్రశేఖరపురంలో సీఎస్‌పురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూడల చిన్నయ్య మెమోరియల్ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లం వెంకట నగేష్‌నాయుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతను క్రీడల్లో పోత్సహించేందుకు కొడవలూరు, విడవలూరు, బుచ్చి, అల్లూరు, దగదర్తి మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిచిన జట్టుకు రూ.10 వేలు వంతున నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతిమ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వనున్నట్లు వివరించారు. సర్పంచ్ చాటూరు లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గరిక మస్తానయ్య, ప్రసన్నకుమార్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.